

మహోన్నత ఆశయంతో ఇందిరా డెయిరీ 3 లో

# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )

Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :153 | బుధవారం 04 జూన్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695



ఖమ్మం జిల్లాలో "గోదావరి" పరవళ్లకు సిద్ధం 3 లో

## ఓర్వలేకే మిస్ వరల్డ్ పోటీలపై ఆరోపణలు : పొన్నం ప్రభాకర్



2 లో

న్యూస్ డెస్క్,03 జూన్ (కెరటం న్యూస్): మిస్ వరల్డ్ పోటీలతో తెలంగాణ రాష్ట్రం ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని ఇది చూసి ఓర్వలేక కొంత మంది ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. వారి మీద వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి మిస్ వరల్డ్ పోటీల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వం ఏర్పాటైన మొదటి నెల నుండే వారు పిల్లి శాపనార్థాలు పెడుతూ విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.



2 లో

## నరేంద్ర మోడీ కాదు.. సరెండర్ మోడీ: రాహుల్ గాంధీ

● ట్రంప్ ఫోన్‌కాల్‌తోనే మోడీ లొంగిపోయారు: భారత్-పాక్ కాల్పుల విరమణపై రాహుల్ ఫైర్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఒత్తిడికి భయపడేవారు ● గాంధీ, నెహ్రూ, పటేల్ లు లొంగుబాటు లేఖలు రాయలేదు - రాహుల్ గాంధీ స్పందన ● ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ మౌనం ఎందుకు? ప్రధాని స్పందించాలని ప్రతిపక్షాల డిమాండ్



2 లో

## రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది! -వైఎస్ జగన్

● చంద్రబాబుపై 24 కేసులున్నాయి.. ఆయన్ని రోడ్డుపైకి తీసుకొచ్చి కొడితే ధర్మమేనా..? తెనాలి ఘటనపై వైఎస్ జగన్ ఫైర్ ● పోలీసులు కోర్టులకే పనులు చెయ్యాలి, రోడ్డుపై న్యాయం కాదు ● దళితులపై పోలీసుల దాడి: విక్టర్, రాకేష్, బాబూలాల్‌ను కిరాతకంగా కొట్టారు ● చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసు వ్యవస్థ దుర్వినియోగం" - జగన్ తీవ్ర ఆరోపణలు

## కేసీఆర్ నిజాయితీ పరుడైతే విచారణకు హాజరు కావాలి : మంత్రి సీతక్క



2 లో

న్యూస్ డెస్క్,03 జూన్ (కెరటం న్యూస్): గులాబీ అధినేత కేసీఆర్ పై మంత్రి సీతక్క ఘాటు వ్యాఖ్యలు చేశారు. నిజంగా కేసీఆర్ నిజాయితీ పరుడైతే కాళేశ్వరం విచారణకు హాజరు కావాలని డిమాండ్ చేశారు. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని విజిలెన్స్ కమిషన్ విచారణ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతోందని పేర్కొన్నారు. నిజాయితీ ఉంటే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కమిషన్ ముందు హాజరై వివరణ ఇవ్వాలని సీతక్క డిమాండ్ చేశారు.




2 లో

## ఆపరేషన్ సింధూర్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు 'నో' చెప్పిన కేంద్రం.!

న్యూస్ డెస్క్,03 జూన్ (కెరటం న్యూస్): పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, భారత్ ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌కి సమాధానం ఇచ్చింది. అయితే, దీనిపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఈ డిమాండ్‌ని ప్రభుత్వ పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తోంది. జూలైలో వర్షాకాల సమావేశాలు జరుగుతాయి కాబట్టి, ప్రస్తుతం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం సమర్థనీయం కాదని సంబంధిత వర్గాలు తెలిపాయి



## దేశానికే తలమానికంగా భూ భారతి చట్టం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- జూన్ 3 నుంచి జూన్ 20 వరకు ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ
- ఆగస్టు 15 నాటికి భూ సమస్యలను పరిష్కరించి రైతులకు భూ భద్రత కల్పిస్తాం
- మనిషికి ఆధార్ ఉన్నట్లు ప్రతి భూమికి భూధార్ వ్యవస్థ ఏర్పాటు
- నాట్ల కంటే ముందే రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు జమ
- ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే,
- రెవెన్యూ సదస్సులను ప్రారంభించిన డిప్యూటీ సీఎం

ఖమ్మం బ్యూరో,03 జూన్ (కెరటం న్యూస్): దేశానికే తలమానికంగా భూ భారతి రెవెన్యూ చట్టాన్ని ప్రజా ప్రభుత్వం రూపొందించిందని, పేద ప్రజలకు చుట్టంగా భూ భారతి చట్టం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే, రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లతో కలిసి ప్రారంభించారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నక్షాలు లేకుండా మన రాష్ట్రంలో 413 గ్రామాలలో దశాబ్దాల కాలంగా పాలన సాగుతోందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కష్టాలు పడుతున్నారని, భూ భారతి చట్టం ద్వారా 413 గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సర్వే చేయించి సరిహద్దు లను నిర్ణయించి ఇబ్బందులు లేకుండా చేయాలని పైలెట్ ప్రాజెక్టు క్రింద ములుగుమాడు గ్రామాన్ని ఎంపిక చేసామని తెలిపారు.

దేశ చరిత్రలో చాలా అరుదుగా భూ భారతి వంటి అద్భుతమైన చట్టాలు వస్తాయని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తెలంగాణ టెనెన్సీ యాక్ట్ 1950 ద్వారా పేదలకు భూ హక్కులను కల్పించామని , 1971 ఆర్.ఓ.ఆర్. చట్టం, 1973 భూ సంస్కరణల కారణంగా రైతులకు చాలా మేలు జరిగిందని, ఈ చట్టాల కారణంగా భూమి లేని నిరుపేదలకు మిగులు భూమి పంపిణీ చేసి వారికి గౌరవం కల్పించామని అన్నారు.

2020 సంవత్సరంలో వచ్చిన ధరణి చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయని, భూమి హక్కులు లేకపోయినా అదనంగా పాస్ పుస్తకాలు అందించడం, గత చట్టాల వల్ల వచ్చిన భూ హక్కులను కాల రాస్తూ మరొకరి పేరు మీద భూములు ఎక్కించడం వంటి అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయని అన్నారు.

మార్పులు, చేర్పులు చేసేందుకు రెవెన్యూ వ్యవస్థలో ఎటువంటి అవకాశం లేకుండా గత ప్రభుత్వం చట్టం తీసుకుని వచ్చిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ఉపయోగ పడే విధంగా అందరి సలహాలు స్వీకరించి భూ భారతి చట్టం తీసుకొని వచ్చినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. గతంలో భూమి సుంకం చెల్లించే సమయంలో రైతులు తమ పేరిట భూములు ఉన్నాయని వివరాలను చెక్ చేసుకునే సౌలభ్యం ఉండేదని, ధరణి చట్టం వల్ల అటువంటి అవకాశం లేకుండా పోయిందని డిప్యూటీ సీఎం తెలిపారు.

భూ భారతి చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూమి అమ్మకాల, కొనుగోలు వివరాలను అప్ డేట్ చేస్తూ, భూ రికార్డులను మాన్యువల్ గా రాసి పంచాయతీ కార్యాలయంలో అతికించడం జరుగుతుందని అన్నారు. భూ సంస్కరణల కారణంగా రాష్ట్రంలో దాదాపు 26 లక్షల ఎకరాలు పేదలకు అసైన్డ్ చేస్తూ పంపిణీ చేయడం జరిగిందని, ధరణి లో ఇట్టి భూములను పార్ట్ బీ లో పెట్టి ప్రజలకు ఇబ్బందులకు గురి చేశారని, అర్హులైన వారికి భూ భారతి చట్టం ద్వారా పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. భవిష్యత్తులో అసెంబ్లీ సెగ్మెంట్ వారిగా అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి మిగులు భూములను ఇంటి పట్టాల పంపిణీ, భూ పంపిణీ కార్యక్రమాన్ని తిరిగి ప్రవేశ పెడ్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజలకు ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ అధికారుల దగ్గరే పరిష్కరించుకునేలా అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పట్టాపాస్ పుస్తకాలలో ఉన్న తప్పుల కారణంగా రైతులు చాలా ఆందోళనకు గురవుతున్నారని, గ్రామంలో ఉన్న తక్కువ విస్తీర్ణం భూమికి కూడా కొన్ని చోట్ల పట్టాలలో వేల ఎకరాలు ఉన్నట్లు ఉందని, దీనివల్ల ప్రభుత్వంపై కూడా భారం పడుతుందని మంత్రి తెలిపారు. భూముల ధరలు పెరిగిపోవడం వల్ల అన్నదమ్ములు, స్నేహితుల మధ్య కూడా గొడవలు జరిగి హత్యల వరకు దారి తీస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, మన శక్తి మేరకు వేగవంతంగా సర్వే చేసి నిఖార్సైన రికార్డులు తయారు చేస్తామని అన్నారు. దేశంలో శాంతి భద్రతలు మన తెలంగాణ రాష్ట్రంలోనే అద్భుతంగా ఉన్నాయని, ప్రజా ప్రభుత్వం భారీ ఎత్తున పెట్టుబడులను సాధించిందని, ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడుతుందని మంత్రి అన్నారు. భూముల రికార్డులు సక్రమంగా నిర్వహించేందుకు రైతులు, భూ యాజమానుల నుంచి టోకెన్ అమౌంట్ సేకరించాలని మంత్రి సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే భూ భారతి చట్టం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఒకే సంవత్సరంలో 36 వేల కోట్ల రూపాయలను నేరుగా అందించామని తెలిపారు. నాట్లకు ముందే రైతు భరోసా పథకం నిధులు ప్రభుత్వం జమ చేస్తుందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత క్రింద ప్రభుత్వం 4 లక్షల 50 వేల ఇండ్లను మంజూరు చేసిందని, వీటిని గుడిసెలలో ఉండే పేదలను ఎంపిక చేసి అమలు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఒక అనర్హుడికి ఇండ్లు కేటాయించినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రోడ్లు విశాలంగా ఉంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, రోడ్డు విస్తరణ కోసం ప్రజలు ముందుకు రావాలని మంత్రి తెలిపారు. దేశానికే తలమానికంగా భూ భారతి చట్టం మన జిల్లాలో అమలు చేయడం జరుగుతుందని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అభిలాష మేరకు ప్రభుత్వం పాలన అందించాలనే లక్ష్యంతో, గత పాలకులు ప్రజలపై రుద్దిన ధరణి చట్టం వల్ల రైతులు, ఆసాములు పడిన ఇబ్బందులు తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను స్టడీ చేసి భూ భారతి చట్టం ఏప్రిల్ 14 న ప్రవేశ పెట్టిందని అన్నారు.

2 లో






● ఇనుగుర్తిలో పండుగలాడా.బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

● ముఖ్య అతిథులుగా ఎంపీ వద్దిరాజు, ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డి

## ఎంపీ వద్దిరాజు స్వగ్రామంలో అంబరం తాకిన సంబురం

ఇనుగుర్తి,03 జూన్ (కెరటం న్యూస్): నాయకులు రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలను పరిమితం చేసి, ఆ తర్వాత సమయానంతా గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కేటాయిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ రవిచంద్ర స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరిగింది. ఇనుగుర్తి, దాని పరిసర గ్రామాలకు చెందిన వేలాదిమంది హర్షధ్వానాలు, జైభీమ్ నినాదాల మధ్య ఎంపీ రవిచంద్ర తన పెద్దన్న వద్దిరాజు కిషన్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, లోకసభ సభ్యులు బలరాం నాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యేలు మురళీనాయక్, డాక్టర్ రాంచంద్రనాయక్, బీఆర్ఎస్ నాయకులు, ఐపీఎస్ మాజీ అధికారి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితర ప్రముఖులతో కలిసి అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత జరిగిన సభకు హాజరైన అతిథులపై గ్రామస్తులు, బాలబాలికలు పూలు జల్లుతూ ఘన స్వాగతం పలికారు. అతిథులకు ఎంపీ రవిచంద్ర తమ్ముడు వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, మహనీయులు అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వారు మాత్రమే కాదని, దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ఆయన అందరివారని స్పష్టం చేశారు. అంబేద్కర్ లేని రాజ్యాంగాన్ని మనం ఊహించలేమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని, అభ్యున్నతిని ఆకాంక్షించిన గొప్ప సామాజిక విప్లవకారులని కొనియాడారు.

2 లో

# దేశానికే తలమానికంగా భూ భారతి చట్టం

మొదటి పేజీ తరువాయి

భూ భారతి చట్టం అమలు ప్రజలపై ఎటువంటి ప్రభావం ఉంటుందో గమనించాలని ముందస్తుగా నాలుగు మండలాలను, రెండో విడతలో ప్రతి జిల్లాలో ఒక మండలం పైలెట్ క్రింద ఎంపిక చేసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 3 నుంచి జూన్ 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాలలో తహసిల్దార్ అధ్యక్షతన రెవెన్యూ బృందం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మంత్రి తెలిపారు.ప్రజల నుంచి ఒక రూపాయి కూడా ఫీజు తీసుకోకుండా వారికి ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని, పేదలకు చుట్టంగా భూ భారతి చట్టం పని చేస్తుందని అన్నారు. రాబోయే ఆగస్టు 15 నాటికి ప్రజల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు భద్రత కల్పిస్తామని అన్నారు. రాష్ట్రంలోని 413 గ్రామాలలో సరైన భూ రికార్డులు, నక్షాలు లేవని, వీటిలో 5 గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్ క్రింద చేపట్టి దేశంలోని 5 ప్రముఖ సంస్థల ద్వారా సర్వే చేస్తున్నామని, వీటిలో ములుగుమాడు గ్రామం కూడా ఉందని అన్నారు. డ్రోన్, డిజిపిఎస్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించి కొలతలలో ఎటువంటి పొరపాటు లేకుండా పకడ్బందీగా నక్షా తయారు చేస్తామని అన్నారు. భూ హక్కులకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న గతంలో సివిల్ కోర్టుకు వెళ్ళాల్సి ఉండేదని, నేడు రెవెన్యూ కోర్టుల ద్వారా అధికారుల వద్ద వాటికి పరిష్కారం లభిస్తుందని అన్నారు. గతంలో ఇందిరమ్మ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు వరకు పేదలకు పంచిందని, అటువంటి భూములను ధరణితో పేరుతో లక్షలాది ఎకరాలను తారుమూరు చేశారని, వీటిలో జరిగిన అక్రమాలను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తామని, అసైన్డ్ భూ హక్కుదారులకు కూడా పూర్తి హక్కులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రైవేట్ వ్యవస్థలో మొదటి విడత క్రింద రాష్ట్రంలో 6 వేల మంది సర్వేయర్లకు శిక్షణ అందించి వారికి లైసెన్స్ జారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఒక రెవెన్యూ అధికారి ఉండే విధంగా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల 556 మంది రెవెన్యూ అధికారులను రాబోయే నాలుగు రోజులలో నియమిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సీసీఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ భూముల సర్వే చివరి సారిగా 1950 లలో కొంతమేర జరిగిందని, అనంతరం చిన్న కుటుంబాలు ఏర్పడి నప్పటికీ చాలా కాలం వరకు సర్వే జరగలేదని అన్నారు. భూముల సర్వే నెంబర్లలో రెండు కోట్ల వరకు సబ్ డివిజన్లు ఉంటే, 40 లక్షల వరకు మాత్రమే మ్యాప్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విలేజ్ మ్యాప్ లేని 413 గ్రామాల్లో నూతనంగా సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ములుగుమాడు గ్రామం నుంచి సర్వే ప్రారంభ మవుతుందని కమీషనర్ తెలిపారు. డ్రోన్, డిజిపిఎస్ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సర్వే చేస్తామని, దీని వల్ల ఖచ్చితమైన భూ కొలతలు తీసుకోవచ్చని అన్నారు.మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ నెంబర్ భూమికి సంబంధించిన అన్ని వివరాలతో అందించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఇక నుంచి భూముల క్రయ, విక్రయాలకు తప్పనిసరిగా మ్యాప్ జత చేయాలని, దీని కోసం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా లైసెన్స్ ప్రైవేటు సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని సిసిఎల్ఏ కమీషనర్ తెలిపారు. ప్రభుత్వమే సర్వే చేయకుండా భూ యాజమాన్యులు కూడా ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి ప్రభుత్వ వెబ్ సైట్ లో నమోదు చేసి అనుమతి తీసుకుంటే భూ సర్వే క్రింద నమోదు అవుతుందని అన్నారు. ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ములుగుమాడు గ్రామంలో ఉన్న ప్రతి ఇంచు భూమికి సర్వే చేసి పట్టా పాస్ పుస్తకంతో పాటు మ్యాప్ కూడా భూ హక్కు దారులకు అందిస్తామని అన్నారు. పారదర్శకంగా సర్వే కార్యక్రమం జరుగుతుందని అన్నారు. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటిని ఆగస్టు 15 నాటికి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ మాట్లాడుతూ ములుగుమాడు గ్రామంలో చేపట్టే పైలెట్ సర్వే కార్యక్రమం చాలా కీలకమైందని, ఇందులో వచ్చే ఫలితాలను ఆధారం చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా దీనిని అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ములుగుమాడు గ్రామంలో కనీసం 4 నెలల పాటు ఈ సర్వే జరుగుతుందని, గ్రామ పెద్దలు సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పూర్తిగా సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూలి భూ భారతి చట్టం అమలు లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని నేడు ప్రారంభిస్తున్నామని అన్నారు. ములుగుమాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద సర్వే కార్యక్రమం చేపట్టామని కలెక్టర్ తెలిపారు. భూములు సర్వే చేసిన తర్వాతే యాజమాన్య హక్కులు స్పష్టంగా తెలుస్తాయని, భూమి పంచుకునే సమయంలో సర్వే చేసుకోని కారణంగా పట్టాలో ఒక భూమి ఉంటే మనకు కబ్జాలో మరో భూమి ఉంటుందని, నక్షాలు లేని ములుగుమాడు గ్రామంలో సర్వే చేయాల్సిన అవసరం ఉందని గమనించి ఈ ప్రక్రియ చేపట్టామని అన్నారు. భూముల మ్యూటేషన్ సమయంలో కుటుంబ సభ్యులందరికీ తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, 30 రోజుల లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చట్టంలో మార్పులు తీసుకొని వచ్చామని అన్నారు. భూ యాజమాన్య వివాదాలను గతంలో సివిల్ కోర్టులో మాత్రమే పరిష్కారం ఉండేదని, ప్రభుత్వం తహసిల్దార్ నుంచి సిసిఎల్ఏ వరకు రెవెన్యూ కోర్టులను మళ్లీ ప్రవేశ పెట్టిందని అన్నారు. గతంలో జరిగిన సర్వే ఆధారంగా భూ రికార్డులు ఉన్నాయని ప్రస్తుతం ములుగు మాడు గ్రామంలో సర్వే పైలట్ ప్రాజెక్ట్ చేస్తున్నామని, ఆదునిక సాంకేతికత డిజిపిఎస్ వ్యవస్థ, డ్రోన్ లను వినియోగిస్తూ భూముల వివరాలు స్పష్టంగా నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జెడి ప్రసన్న లక్ష్మీ, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, ఎర్రుపాలెం తహసీల్దార్ ఉషా శారద, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నిజాయితీ పరుడైతే విచారణకు హాజరు కావాలి : మంత్రి సీతక్క

**న్యూస్ డెస్క్,03 జూన్ (కెరటం న్యూస్):** గులాబీ అధినేత కేసీఆర్ పై మంత్రి సీతక్క ఘాటు వ్యాఖ్యలు చేశారు. నిజంగా కేసీఆర్ నిజాయితీ పరుడైతే కాళేశ్వరం విచారణకు హాజరు కావాలని డిమాండ్ చేశారు. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని విజిలెన్స్ కమిషన్ విచారణ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతోందని పేర్కొన్నారు. నిజాయితీ ఉంటే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కమిషన్ ముందు హాజరై వివరణ ఇవ్వాలని సీతక్క డిమాండ్ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.1.47 లక్షల కోట్లు దాటిన ఖర్చులో అవకతవకలు జరిగాయని, ఈ డబ్బుతో కొందరు విదేశాల్లో సంబరాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా కేసీఆర్ కుమార్తె కవిత అవతరణ దినోత్సవాన్ని అమెరికాలో జరుపుకోవడాన్ని సీతక్క ప్రస్తావిస్తూ.. ఇది లిక్కర్ కేసు నుంచి ప్రజల్ని దృష్టి మరల్చే బీఆర్ఎస్ డ్రామా అని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం వల్ల రూ.1 లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లలో నిరుపయోగమైందని మండిపడ్డారు.దీనిపై విచారణను బీఆర్ఎస్ నాయకులు రాజకీయ కుట్రగా చిత్రీకరిస్తున్నారని, కానీ నాలుగు స్తంభాల ఆట (అధికారం కోసం రాజకీయ కుట్రలు) వారి ఉద్దేశమని సీతక్క విమర్శించారు. కమిషన్ 50 మంది ఇరిగేషన్ అధికారులపై చర్యలు సిఫార్సు చేసిన నేపథ్యంలో సీతక్క ఈ వ్యాఖ్యలు చేయడం రాష్ట్రంలో మరింత రాజకీయ హీట్ ను పెంచినట్టైంది.

# ఎంపీ వద్దిరాజు స్వగ్రామంలో అంబరం తాకిన సంబురం

- ఇనుగుర్తిలో పండుగలాడా.బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథులుగా ఎంపీ వద్దిరాజు, ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్స్ అమలవుతున్నాయని ఎంపీ రవిచంద్ర వివరించారు. దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించి కోట్లాది మంది జీవితాలలో వెలుగులు ప్రసరింప జేసిన ఆ మహనీయుని విగ్రహాన్ని మనమిప్పుడు ఆవిష్కరించుకోవడం ఆనందదాయకం అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను రెండు మార్లు పెద్దల సభ రాజ్యసభకు పంపారని, ఆయన్ను ఒప్పించి ఇనుగుర్తికి మండల కేంద్రాన్ని తీసుకొచ్చానని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఇంతకుముందు ఇది కేసముద్రం మండలంలో ఉండేదని, ఇప్పుడు ఈ రెండింటిని అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యత తనతో పాటు ఈ వేదికపై ఆసీనులైన నాయకులందరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి మహబూబాబాద్ జిల్లా అభివృద్ధికి విశేష కృషి సల్పుతున్నారని, కొత్తగా ఏర్పాటైన ఇనుగుర్తిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా కోరుతున్నా నన్నారు. మాజీ ప్రధాని పీ.వీ.నర్సింహారావు బాల్యంలో ఇనుగుర్తిలోనే చదువుకున్నారని, 1921లో మొట్టమొదటి తెలుగు పత్రిక కూడా ఇక్కడ నుంచే వచ్చిందని, ఈ గ్రామం వాలీబాల్ ఆటకు పేరుగాంచిన విషయం అందరికి తెలిసిందేనని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. ఇంతటి చరిత్ర ఉన్న, ప్రాధాన్యత కలిగిన ఇనుగుర్తిని రాజకీయాలకు అతీతంగా మరింత అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుదామన్నారు. పెట్రోలియం, సహజ వాయువు పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యుడిగా వివిధ చమురు సంస్థల నుంచి నిధులు తీసుకువచ్చి ఇనుగుర్తి ప్రాథమిక, ఉన్నత పాఠశాల శాలలకు అధునాతన భవనాలను నిర్మించే ప్రయత్నాలు చేస్తుంటే జిల్లా కలెక్టర్ సహకరించడం లేదని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు సంపూర్ణ సహకారం అందించాలంటూ కలెక్టర్ కు తగు ఆదేశాలివ్వాల్సిందిగా నరేందర్ రెడ్డిని ఎంపీ రవిచంద్ర కోరారు.అదేవిధంగా తహశీల్దార్,ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, ఇండోర్ స్టేడియం నిర్మాణాలకు, జూనియర్,డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు చేయూతనివ్వాల్సిందిగా నరేందర్ రెడ్డికి ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి చేశారు. ఇనుగుర్తిలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు తాను ప్రయత్నం చేశానని, ఇందుకోసం అవసరమైన ఐదెకరాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని ఎంపీ రవిచంద్ర పునరుద్ఘాటించారు.ఈ చుట్టుప్రక్కల గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు తప్పకుండా సహకరిస్తానని ఎంపీ వద్దిరాజు హామీనిచ్చారు.ఈ సందర్భంగా అతిథులను ఎంపీ రవిచంద్ర శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మర్రి రంగారావు, మాల మహానాడు అధ్యక్షుడు లింగాల రవికుమార్, ఇనుగుర్తి మాజీ సర్పంచ్ రాంమూర్తి, పిల్లి సుధాకర్, సావిత్రమ్మ , సునీత,నాగరాజు, ఎల్లయ్య,వెంకన్న, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. ఇనుగుర్తిలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఎంపీ వద్దిరాజు తన సోదరులు కిషన్, దేవేందర్, వెంకటేశ్వర్లతో కలిసి చేయూత నందించారు.





# ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు 'నో' చెప్పిన కేంద్రం.!

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రతిపక్షాలకు అన్ని వివరాలు తెలియజేసినట్లు కేంద్రం చెబుతోంది.

పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది అమాయకులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుచున్నారు. ఈ దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించింది. 9 ఉగ్రస్థావరాలను నేటమట్టం చేసి 100కు పైగా ఉగ్రవాదుల్ని హతమార్చింది. ఆ తర్వాత, పాక్ కవ్వింపులకు ప్రతీకారంగా ఆ దేశానికి చెందిన 11 వైమానిక స్థావరాలపై భారత్ దాడులు చేసింది.అయితే, ఈ దాడుల్లో భారత్ రాఫెల్ విమానాలను కోల్పోయిందని పాకిస్తాన్ ఆరోపించింది. దీనికి తోడు ఆపరేషన్ ప్రారంభంలో తమకు వైమానిక నష్టాలు ఉన్నాయని సీడీఎస్ అనిల్ చౌహాన్ చెప్పడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మరోసారి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు, ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయవచ్చని కాంగ్రెస్ భావించింది. కానీ అలాంటి ప్రణాళికలు లేవని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# నరేంద్ర మోడీ కాదు.. సరెండర్ మోడీ : రాహుల్ గాంధీ

**న్యూస్ డెస్క్,03 జూన్ (కెరటం న్యూస్):** భారత్, పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ అవగాహన ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్?లో పర్యటించారు. సంఘ్టన్ సృజన్ అభియాన్ అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపు మేరకు ప్రధాని నరేంద్ర మోడీ లొంగిపోయారని ఆరోపించారు. ట్రంప్ ఫోన్ చేయగానే పాక్?తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. "డొనాల్డ్ ట్రంప్ అక్కడి నుంచి ఫోన్ చేసి –నరేందర్.. సరెండర్ అన్నారు. ఇక్కడ మోడీ వెంటనే.. ఒకే సార్ అని లొంగిపోయారు" అని రాహుల్ అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలపై కొంచెం ఒత్తిడి తెచ్చినా వారు భయపడి పారిపోతారని.. అది వారికి బాగా అలవాటని ఎద్దేవా చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కూడా వాళ్లకు లొంగుబాటు లేఖలు రాసే అలవాటు ఉందని సెటైర్ వేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అలా కాదని.. ఎవరి బెదిరింపులకు తలొగ్గదని అన్నారు. గాంధీజీ, నెహ్రూజీ, సర్దార్ పటేల్జీ –వీరు లొంగిపోయే వ్యక్తులు కాదని.. అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తులని హాట్ కామెంట్స్ చేశారు. కాగా, తన వల్లే భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ పదే పదే చెబుతోన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో పక్షం జోక్యం లేదని.. భారత్, పాక్ మధ్య హాట్ లైన్ చర్చల ద్వారా కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని భారత్ క్లారిటీ ఇచ్చింది. కానీ ట్రంప్ మాత్రం తన వల్లే సీజ్ ఫైర్ అగ్రిమెంట్ కుదిరిందని కామెంట్స్ చేస్తున్నాడు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోడీ ఇప్పటి వరకు స్పందించలేదు. దీంతో ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారని.. ఆయన నోరు విప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ తరుణంలో ట్రంప్ ఫోన్ కాల్ వల్లే మోడీ సరెండర్ అయ్యారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం దేశ రాజకీయాల్లో సంచలనంగా మారింది.

# ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది! -వైఎస్ జగన్

**న్యూస్ డెస్క్,03 జూన్ (కెరటం న్యూస్):** ఇదే చంద్రబాబుపై ఇరవై నాలుగు కేసులున్నాయని ఆయనను రోడ్డుపైకి తీసుకొచ్చి కొడితే ధర్మమేనా? అనిఅడుగుతున్నాను అంటూ ప్రశ్నించారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. గుంటూరు జిల్లా తెనాలిలో పర్యటించిన ఆయన.. లో వైఎస్ జగన్.. జాన్ విక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్.. ఇటీవల పోలీసుల దాడిలో గాయపడ్డ జాన్ విక్టర్ సహా ముగ్గురుని, వాళ్ల కుటుంబాలను పరామర్శించారు.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. విక్టర్ పై ఘటన జరిగిన తర్వాత రౌడీషీట్ ఓపెన్ చేశారు.. ఇంత స్పష్టంగా నిజాలు ఉన్నాయి.. జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తే రకరకాలుగా అధికారపార్టీ నేతలు మాట్లాడుతున్నారు.. కేసులు తేల్చాల్సింది కోర్టులు.. కోర్టు అధికారం పోలీసులు తీసుకోవడం ధర్మమేనా? అని నిలదీశారు.. రాష్ట్రంలో ఈరోజు రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుంది.. అదుపుతప్పిన పోలీసు వ్యవస్థకు నిదర్శనం తెనాలి ఘటనే అన్నారు..రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు గమనిస్తే అర్థమవుతుంది.. పోలీసు వ్యవస్థను సీఎం చంద్రబాబు దుర్వినియోగం చేస్తున్నారు.. చంద్రబాబు దగ్గరుండి వైసీపీ నాయకులుపై కేసులుపెట్టిస్తున్నారని విమర్శించారు వైఎస్ జగన్.. అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారో అర్ధమవుతుంది.. పోలీసు వ్యవస్థ అదుపుతప్పితే ప్రమాదం.. ఇంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయి.. పోలీసుల చేతిలో దెబ్బలు తిన్నవారు రాకేష్, జాన్ విక్టర్, బాబూలాల్ దళితులు, వెనుకబడినవారు. రాకేష్ హైదరాబాదులో జొమాటోలో పనిచేస్తున్నారు.. పాత కేసులో వాయిదాకోసం వచ్చాడు. రాకేష్ స్నేహితులు మంగళగిరి నుంచి చూసేందుకు వచ్చారు. విక్టర్ జూనియర్ అడ్వకేట్.. అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేస్తున్నాడు.. కరిముల్లా అలియాస్ బాబూలాల్ యువకుడు మెకానిక్.. ఐతానగర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు వస్తే అదే సమయంలో సివిల్ డ్రస్ లో కానిస్టేబుల్ వచ్చాడు.. కానిస్టేబుల్ ఎవరితోనో గొడవ పడుతుంటే ముగ్గురు ఆపేందుకు ప్రయత్నించారు.. దీంతో కానిస్టేబుల్ ముగ్గురు యువకులకు చెందిన బైకు తాళాలు తీసుకునేందుకు యత్నించాడని తెలిపారు..25న కానిస్టేబుల్ తోపాటు మరికొందరు పోలీసులు మంగళగిరి నుంచి కొట్టుకుంటూ తీసుకొచ్చారు.. తర్వాత ఏప్రిల్ 26న స్టేషన్ దగ్గరలో ఉన్న ఐతానగర్ కు తీసుకెళ్ళి రోడ్డుపై కొట్టారని ఫైర్ అయ్యారు వైఎస్ జగన్.. పరువు తీసే ప్రయత్నం చేశారు.. తెనాలి టూటౌన్ సీఐతోపాటు మరో సీఐ వచ్చి కొట్టారు.. నడిరోడ్డుపై అతి కిరాతకంగా పరువు, ప్రతిష్టలు తీసేలా కొట్టారు. ముగ్గురు యువకుల కాళ్లకు బొబ్బలు వచ్చేలా కొట్టారు. తర్వాత పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. మరుసటి రోజు లింగారావు సెంటర్ లో మళ్లీ కిరాతకంగా కొట్టారు. మూడు రోజులు పోలీసులు అదుపులో ఉంచుకున్నారు. పోలీసులే వీరిజేబులో కత్తి పెట్టి వీఆర్వోల సమక్షంలో అదుపులోకి తీసుకున్నట్లు కేసు రాశారు.. 28న ముగ్గురిని కోర్టులో హాజరుపర్చారు.. డాక్టర్ వద్దకు తీసుకెళ్లి ఎటువంటి దెబ్బలు తగల్లేదని సర్టిఫికేట్ తీసుకున్నారు. పోలీసులుకొట్టారని న్యాయమూర్తికి చెబితే ఎస్పీ ఆఫీసుకు తీసుకెళ్ళి కరెంట్ షాక్ పెడతామని బెదిరించారు.. దాడి జరిగితే కానిస్టేబుల్ మరుసటి రోజు వరకూ ఎందుకు ఉన్నతాధికారులకు చెప్పలేదు..? సివిల్ డ్రెస్ లో కానిస్టేబుల్ అంబేద్కర్ సెంటర్ కు ఎందుకు వచ్చారు. వీరితో ఎందుకుగొడవపడ్డారు.. ఇరవైనాలుగు గంటల్లో కోర్టులో ఎందుకు హాజరుపర్చలేదు..? కేసు టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తుంటే మరో సీఐ ఎందుకు వచ్చారు..? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు వైఎస్ జగన్..

# ఓర్వలేకే మిస్ వరల్డ్ పోటీలపై ఆరోపణలు: పొన్నం ప్రభాకర్

**న్యూస్ డెస్క్,03 జూన్ (కెరటం న్యూస్):** మిస్ వరల్డ్ పోటీలతో తెలంగాణ రాష్ట్రం ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని ఇది చూసి ఓర్వలేక కొంత మంది ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. వారి మీద వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి మిస్ వరల్డ్ పోటీల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వం ఏర్పాటైన మొదటి నెల నుండే వారు పిల్లి శాపనార్థాలు పెడుతూ విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళవారం సెక్రటేరియట్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. మిస్ వరల్డ్ –2025 కార్యక్రమానికి ప్రభుత్వం నుండి సహకారం అందించామని ప్రజల భాగస్వామ్యం ఉండేలా కార్యక్రమాలు జరిగాయన్నారు. రామప్ప, పోచంపల్లి, వెయ్యి స్థంబాల గుడి, కాకతీయుల కోట, ఓల్డ్ సిటీ తెలంగాణ చరిత్రాత్మక అంశాలు సందర్శించడం ద్వారా తెలంగాణ గౌరవం పెరిగిందన్నారు. మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణను ప్రపంచమే గుర్తించే విధంగా జరిగాయని చెప్పారు. రాజకీయాలు వేరు వచ్చిన అతిథులు గౌరవించుకునే అంశం వేరని కానీ కొంత మంది ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు.పిల్లల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం కావాలంటే వారి చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చదువే అన్ని సమస్యలకు పరిష్కారం అని చెప్పారు. ఇవాళ బేగంపేట ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల్లో చదివి టెన్త్ లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులను మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీ గురుకుల పాఠశాలలు, హాస్టల్ లో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారని మరింత మంది విద్యార్థులకు మార్కులు వచ్చేలా అధ్యాపకుల కృషి పెరగాలన్నారు. మీకు రావాల్సిన బెనిఫిట్స్ సంస్థ తరుపున ప్రభుత్వం నుండి ఎప్పటికప్పుడు ఇస్తున్నామని మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. గతంలో చదువుకోవడానికి వసతి లేదన్నారు. విద్యార్థులంతా పోటీ ప్రపంచంలో నెగ్గేలా విధానపరమైన మార్పులను అవగతం చేసుకోవాలన్నారు.ప్రభుత్వం మెస్, కాస్మోటెకి చార్జీలను పెంచిందని చెప్పారు. మీ దగ్గర నుండి రైసింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని రేపటి తెలంగాణ భవిష్యత్తు కి మీరు మార్గదర్శకులుగా కావాలన్నారు. మన పిల్లలు దేశ అంతర్జాతీయ స్థాయిలో ఎదిగే స్థాయికి ఎదగాలని చెప్పారు. స్టడీస్, ఆటలు, ఇతర నైపుణ్యాల్లో మంచి ప్రతిభ కనబరచాలన్నారు. భవిషత్ లో మనం ఏం కావాలని అనుకుంటున్నామో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆదిశగా ముందుకు పోవాలని అదే సమయంలో కేవలం విద్యాకే పరిమితం కాకుండా సామాజికంగా అన్ని రంగాల్లో ముందుడాలన్నారు. జ్యోతి బాపులే సినిమాను అన్ని గురుకులాల్లో ప్రదర్శిస్తామని తల్లిదండ్రులతో సహా చూపెడతామని చెప్పారు. మహిళలు ఇంత గౌరవంగా చదువుకుంటున్నారంటే ఆనాడు సావిత్రి భాయ్ పూలే ఆదర్శాల ఫలాలు అన్నారు.

# ఎంపీ వద్దిరాజు స్వగ్రామంలో హరీశ్ రావు బర్త్ డే సంబురం



ఇనుగుర్తి,03 జూన్ (కెరటం న్యూస్): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీ రవిచంద్ర తల్లిదండ్రులు వద్దిరాజు నారాయణ-వెంకటనర్సమ్మల స్మృతివనంలో మంగళవారం మాజీ మంత్రి హరీష్ రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు "హ్యాపీ బర్త్ డే టీహెచ్ఆర్" కేక్ కట్ చేసి ఈ వేడుకలు జరిపారు.ఎంపీ వద్దిరాజు ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, బీఆర్ఎస్ నాయకులు, ఐపీఎస్ మాజీ అధికారి డాక్టర్ ఆర్.ఏస్ ప్రవీణ్ కుమార్,మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితర ప్రముఖులతో కలిసి కేక్ కట్ చేసి "హ్యాపీ బర్త్ డే హ్యాపీ బర్త్ డే హరీషన్న హ్యాపీ బర్త్ డే","జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్", "వర్థిల్లాలి వర్థిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్థిల్లాలి"అంటూ నినాదాలు చేశారు.

# పేదల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రభుత్వ లక్ష్యం

## నేలకొండపల్లి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి



నేలకొండపల్లి,03 జూన్ (కెరటం న్యూస్): పేదలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సజావుగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలంలో మంగళవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసారు. ముజ్జుగూడెం గ్రామంలో రూ. 16 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన పశు సంవర్ధక శాఖకు చెందిన సబ్ సెంటర్ నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. నేలకొండపల్లి గ్రామంలో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, భైరవుని పల్లిలో రూ. 4 కోట్ల 72 లక్షల 50 వేలతో భైరవునిపల్లి నుండి నాచేపల్లి వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణానికి, చెన్నారం గ్రామం ఎస్సి కాలనీల్లో రూ. 22 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. బోదులబండ గ్రామం ఎస్సి కాలనీ , ముస్లిం బజార్ లలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. అభివృద్ధిలో భాగంగా పశు సంవర్ధక శాఖ ఆసుపత్రిని ఇప్పుడే ప్రారంభించుకున్నట్లు తెలిపారు. గత పాలకులు అందించిన సంక్షేమ పథకాలను కూడా మన ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి తెలిపారు. ఆర్థిక పరిస్థితులను బాగు చేస్తూ పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. రైతులకు దాదాపు రూ. 21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాల్ కు రూ. 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సహాయం ఎకరానికి రూ. 12 వేల రూపాయలకు పెంచామని, రూ. 21 వేల కోట్లు రుణమాఫీ చేశామని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు తప్పనిసరిగా అందిస్తామని, మొదటి విడతలో సొంత స్థలం ఉన్న నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అర్హులైన పేదలకు నాలుగు విడతలుగా రూ. 5 లక్షల రూపాయల సహాయం ఇందిరమ్మ ఇంటి కోసం అందిస్తామని అన్నారు. ముజ్జుగూడెం నుంచి గువ్వలగూడెం రోడ్డు రూ. 2 కోట్ల 60 లక్షలతో మంజూరు చేసామని, త్వరలోనే వాటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విడతలవారీగా అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. శ్రీనివాసరావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏడిఏ సరిత, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడివో ఎర్రయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మహోన్నత ఆశయంతో ఇందిరా డెయిరీ

**ప్రతి ఒక్కరికి రెండు గేదెలు**

**సభ్యులు ఎటువంటి కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన పనిలేదు**

**ఇందిరా డెయిరీ ఏర్పాటు పై అధికారులతో సమీక్ష చేసిన డిప్యూటీ సీఎం భట్టి**



ఖమ్మం/మధిర,03 జూన్ (కెరటం న్యూస్): మధిర నియోజకవర్గంలో గొప్ప ఆశయంతో చేపట్టిన కార్యక్రమం ఇందిరా డెయిరీ అని, అధికారులు మనస్ఫూర్తిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం మధిర క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజిమిల్ ఖాన్ తో కలిసి, డిఆర్డీవో, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఇందిరా డెయిరీ పథకంలో ప్రతి లబ్ధిదారునికి రెండు గేదెలు అందజేయాలని, సభ్యులు ఎటువంటి కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కాంట్రిబ్యూషన్ కు సంబంధించి సభ్యులకు అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందిరా డెయిరీ సభ్యులకు భూమి ఉండాలన్న నిబంధన ఏదీ లేదని, అసలు గేదెలు లేనివారికి ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రానున్న ఐదు నెలల లోపు నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో ఇందిరా డెయిరీ పథకం ప్రారంభం కావాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనులు వేగవంతం చేసేందుకు గేదెల కొనుగోలుకు పెద్ద సంఖ్యలో అధికారుల బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ముజిమిల్ ఖాన్ ను ఆదేశించారు. గేదెల కొనుగోలు బృందంలో తప్పనిసరిగా ఒక విజిలెన్స్ అధికారి ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న గేదెలు, కొత్తగా రాబోతున్న గేదెలు వాటికి అవసరమైన పచ్చి గడ్డి, ఎండు గడ్డి వివరాల సమీక్ష నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గడ్డి అవసరం ఉన్న నేపథ్యంలో నిరుద్యోగులకు గడ్డి సరఫరాకు అవసరమైన అన్ని సహాయ చర్యలు చేపట్టి వారికి ఉపాధి తో పాటు పెద్ద సంఖ్యలో వస్తున్న గేదెలకు గడ్డిని సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పథకం పకడ్బందీగా చేపట్టి పటిష్ట కార్యాచరణ తో ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ సమీక్ష లో డిఆర్డీవో సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, డిటిడబ్ల్యూఓ విజయలక్ష్మి, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, డివిహెచ్ఓ శ్రీనివాస రావు, డీఏఓ పుల్లయ్య, డిబిసిడిఓ జ్యోతి, ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి

**నమోదు కొరకు 2కే రన్ చేపట్టాలి**

**- టియస్ యుటిఎఫ్**



ఖమ్మం,03 జూన్ (కెరటం న్యూస్): రాబోయే విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు చేపట్టే సర్దుబాటు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి నిర్వహించాలని టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం నాడు ఐడిఓసి నందు శ్రీజ కు ప్రాతినిధ్యం చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల నమోదు ఆధారంగా సర్దుబాటు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి అత్యంత పారదర్శకంగా చేపట్టాలని, ఎక్కువమంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. సమగ్ర కుటుంబ సర్వే పైకం వెంటనే చెల్లించాలని కోరారు. యఫ్ఎసి ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పాఠశాలలకు అదనంగా సబ్జెక్టు టీచర్లను నియమించాలని, అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న మరియు విదేశాలు వెళ్లిన ఉపాధ్యాయుల స్థానాల్లో వారు వచ్చేవరకు ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించి బోధనకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. నమోదు పెంచుటకు 2కె రన్ నిర్వహించాలని, గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులను బడిబాటలో భాగస్వామ్యం చేయాలని, మౌలిక వసతులను కల్పించాలని,మన ఊరు మనబడి పథకం, అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం పేరుతో నిర్వహించిన పనులకు బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా నోటు పుస్తకాలు అందించాలని ప్రతి విద్యార్థికి బ్యాగు, టై, బెల్టు ఐడి కార్డు, షూస్ తదితరాలతో.... కిట్ అందించాలని స్థానిక సంస్థల కలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు. సమస్యలన్నింటినీ ఓపికగా విన్న స్థానిక సంస్థల కలెక్టర్ టియస్ యుటిఎఫ్ ప్రాతినిధ్యానికి సానుకూలంగా స్పందిస్తూ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, పారదర్శకంగా సర్దుబాటు ప్రక్రియ చేపడతామని తెలియజేశారు. ప్రాతినిధ్యం చేసిన వారిలో జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, సురేష్, నాగూర్ వలీ,రామకృష్ణ, రాంబాబు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులున్నారు.

# ఖమ్మం జిల్లాలో "గోదావరి" పరవళ్లకు సిద్ధం

**యుద్ధ ప్రాతిపదికన రాజీవ్ లింక్ కెనాల్ పనులు**

**ఈనెల 10లోగా పూర్తిచేయాలని మంత్రి "తుమ్మల"ఆదేశం**

**2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక**

**సాగర్ నీటి కంటే ముందుగా గోదావరి జలాలు**

**రైతు సంక్షేమానికి "మంత్రి తుమ్మల" కృషి**

**నార్లు పోసే సమయానికి నీటి విడుదలకు సన్నాహాలు**

**రెండు పంటలకు నీరిచ్చేలా ప్రభుత్వ కృషి**

**వైరా, సత్తుపల్లి,అశ్వరావుపేట,మధిర నియోజకవర్గాలకు సాగు, త్రాగునీరు**

**మంత్రి తుమ్మల కల సాకారం దిశగా అడుగులు**

**లింక్ కెనాల్ పనులు పరిశీలించిన మంత్రి "తుమ్మల"**



ఖమ్మం బ్యూరో,03 జూన్ (కెరటం న్యూస్): ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలమే లక్ష్యంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రూపుదిద్దుకుంది. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ లో కీలకమైన రాజీవ్ లింక్ కెనాల్ పనులు 7.86 కిలోమీటర్ల కెనాల్ లైనింగ్ పనులు పూర్తయ్యాయి. చివరగా ఒక కిలోమీటర్ కెనాల్ పనులు వారంలో పూర్తి చేయనున్నారు. అశ్వాపురం పంప్ హౌస్ నుంచి మిగిలిన రెండు పంప్ హౌస్ ల ద్వారా వైరా రిజర్వాయర్ కు గోదావరి జలాలు రానున్నాయి. మొదటి పంప్ హౌస్ నుండి 2,3 పంప్ హౌస్ ల వరకు మెయిన్ కెనాల్ లో పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను తొలగించి మరియు లైనింగ్ పనులు పూర్తి చేసి, 3 పంప్ హౌస్ ల నుండి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా నీటిని అందించాలని మంత్రిగారు ఆదేశించారు. సీతారామ పంపుహౌస్‌లు 1, 2, 3 ద్వారా ఖమ్మం జిల్లాలో గోదావరి పరవళ్ళు తొక్కేలా మంత్రి తుమ్మల పనులకు శ్రీకారం చుట్టారు. సీతారామ ప్రాజెక్ట్ మంత్రి తుమ్మల కల... అది పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి పరవళ్ళ తో సస్యశ్యామలంగా మారుతుంది. లక్షలాది ఎకరాల భూములు పసిడి పచ్చల హారం ధరించనుంది. దీంతో మంత్రి తుమ్మల కల సాకారం కానుంది.

రాజీవ్ కెనాల్ ద్వారా... 3 నియోజకవర్గాలకు సాగునీరు

రాజీవ్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలో పలు నియోజకవర్గాలకు సాగు నీరందించేలా పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గోదావరి జలాల ద్వారా వైరా చెరువు నింపేలా చర్యలు చేపట్టారు. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలలోని ఎన్ఎస్పి ఆయకట్టుకు నీరును అందించేలా ప్రణాళికలు చేశారు. ఈ నెలలో వరి నార్లు పోసే సమయానికి నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

వేగంగా యాతాలకుంట టన్నెల్ పనులు

యాతాలకుంట టన్నెల్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పనులను పూర్తి చేసి సత్తుపల్లి, అశ్వరావుపేట నియోజకవర్గాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు మంత్రి తుమ్మల విశేష కృషి చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీడు భూములు లేకుండా పచ్చని పైర్లతో తులతూగేలా మంత్రి తుమ్మల అహర్నిశలు శ్రమిస్తున్నారు.

రెండు నెలల ముందే నీటి విడుదల

ఖమ్మం జిల్లా రైతులకు సాగర్ జలాల కంటే రెండు నెలల ముందే గోదావరి జలాలను తీసుకురావాలని దృఢ సంకల్పంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం పనిచేస్తున్నారు. కాలువలపై అనునిత్యం తిరుగుతూ పనులు పర్యవేక్షిస్తున్నారు. రాజీవ్ లింక్ కెనాల్ మొత్తం 8.86 మీటర్లు ఉండగా ఇప్పటికే 7.86 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశారు. మిగిలిన కిలోమీటర్ పనులు వారంలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. రెండు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించి రైతాంగం సుభిక్షంగా రెండు పంటలు వేసేలా అడుగులు వేస్తున్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు చేస్తున్న కృషిని పనుల పురోగతి వెల్లడిస్తుంది. రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఒక పంటకు సరైన నీళ్లు రాని పరిస్థితి నుంచి రెండు పంటలకు నీరు అందేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కెనాల్ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల

రాజీవ్ కెనాల్ ( ఏన్కూరు లింకు కాలువ) పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన ఈనెల 10వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా నిర్లక్ష్యం లేకుండా పనులు శరవేగంగా జరగాలని, 10 తేదీ నాటికి గోదావరి జలాల విడుదలకు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

## జిల్లా వైద్యాధికారి కళావతిబాయి



ఖమ్మం టౌన్,03 జూన్ (కెరటం న్యూస్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి కళావతి భాయ్ కోరారు. మంగళవారం వెంకటేశ్వర నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ లో జరిగిన ఆశా కార్యకర్తలు సమావేశాలు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల మారిన పడకుండా వారికి అందుబాటులో ఉండి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. వెంకటేశ్వర నగర్ ఆసుపత్రి ఆసుపత్రి మున్నేరు వాగుకు సమీపాన ఉండటంతో పాటు రకరకాల వ్యాపారాలు చేసుకునేవారు నివాస ప్రాంతమైనందున ఇక్కడ వ్యాధులు కూడా త్వరగా ప్రబలే ప్రమాదం ఉందని దీనికి గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాదీని గుర్తించే కార్యక్రమం జరుగుతోందని దీన్ని ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తతతో చేపట్టాలని కోరారు తెలియవలసిందిగా కోరారు. గత



సంవత్సరం వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. వీటితోపాటుగా ఇతర కార్యక్రమాలు కుంటు పడకుండా చర్య తీసుకోవాలని వైద్యాధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామారావు, వైద్యాధికారి డాక్టర్ దేవిశ్రీ, సూపర్వైజర్లు జడ్ ఎస్ జైపాల్ విజయకుమార్, సిహెచ్ రజిని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంగ్లండ్‌కు బయల్దేరిన కేఎల్ రాహుల్

స్పోర్ట్స్ న్యూస్ ,03 జూన్ (కెరటం న్యూస్): త్వరలో ప్రారంభం కానున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టాడు. రాహుల్ నిన్ననే ముంబై నుంచి లండన్‌కు బయల్దేరాడు. రాహుల్ లండన్‌లోని హీత్రూ విమానాశ్రయంలో ల్యాండైన దృశ్యాలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. రాహుల్ ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ లయన్స్‌తో నాలుగు రోజుల అనధికారిక టెస్ట్ మ్యాచ్ ఆడతాడు. ఈ మ్యాచ్ కోసమే రాహుల్ చాలా ముందుగా లండన్‌లో ల్యాండయ్యాడు. ఈ మ్యాచ్ జూన్ 6న ప్రారంభం కానుంది. నార్తంప్టన్ వేదికగా జరుగనుంది. ఈ మ్యాచ్ కోసం తనను ముందుగానే ఇంగ్లండ్‌కు పంపాలని రాహుల్ బీసీసీఐకి ప్రత్యేక విజ్ఞప్తి చేశాడు. భారత్‌లో వాతావరణం ప్రాక్టీస్‌కు అనువుగా లేదని, అందుకే తనకు లయన్స్‌తో మ్యాచ్ ఆడే అవకాశం ఇవ్వాలని రాహుల్ బీసీసీఐని కోరాడు. రాహుల్ కోరిక మేరకు బీసీసీఐ అతన్ని ముందుగానే లండన్‌కు పంపింది.



ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు భారత్-ఏ జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు నాలుగు రోజుల అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్ నిన్ననే ముగిసింది. ఈ మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆటగాళ్లకు మంచి బ్యాటింగ్ ప్రాక్టీస్ లభించింది. ఇంగ్లండ్ సిరీస్‌కు ఎంపికైన కరుణ్ నాయర్ డబుల్ సెంచరీతో చెలరేగాడు. తొలి ఇన్నింగ్స్‌లో సర్ఫరాజ్ ఖాన్, ధృవ్ జురెల్ తృటిలో సెంచరీలు మిస్ అయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్, కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్, ధృవ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి అర్ధ సెంచరీలతో రాణించారు.

లయన్స్‌తో రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ తర్వాత భారత జట్టు ఓ ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతుంది. ఈ మ్యాచ్ జూన్ 13 నుంచి 16 వరకు జరుగుతుంది. అనంతరం జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ కోసం శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టు జూన్ 5వ తేదీ తర్వాత లండన్‌కు బయల్దేరుతుంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో ఈ సిరీస్‌కు ముందే గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ సిరీస్‌కు ముందే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కూడా టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు.

ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్, యశస్వి జైస్వాల్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, ధృవ్ జురెల్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్, ఆకాశ్‌దీప్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్

# ఐపీఎల్ ఛాంపియన్‌గా ఆర్సీబీ..

## భావోద్వేగానికి లోనైన కోహ్లీ..!

స్పోర్ట్ న్యూస్ ,03 జూన్ (కెరటం న్యూస్): ఐపీఎల్ చరిత్రలో కొత్త ఛాంపియన్ అవతరించింది. 18 ఏళ్లుగా ట్రోఫీ కోసం పడిగాపులు కాస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబి) తొలి టైటిల్‌ను గెలుపొందింది. ఆరంభ సీజన్ నుంచి ఆర్సీబీకి ఆడుతున్న విరాట్ కోహ్లీ కి ఇదే మొదటి ట్రోఫీ. దాంతో, అతడు భావోద్వేగానికి లోనయ్యాడు. ఈ లెజెండరీ ఆటగాడు ఉబికివస్తున్న కన్నీళ్లను దాచలేకపోయాడు.




అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌పై 6 పరుగులతో బెంగళూరు విజయం సాధించగానే విరాట్ తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయాడు.పట్టలేనంత సంతోషంతో మైదానంలోనే కూలబడిపోయి.. ఈ నేలకు వందనం.. అంటూ నమస్కరించాడు. అనంతరం తన మాజీ సహచరుడు ఏబీ డివిలియర్స్‌ను హత్తుకున్న కోహ్లీ.. భార్య అనుష్క శర్మకు బిగ్ హగ్ ఇచ్చి తన జట్టు విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నాడు.

'ఈ విజయం నాకే కాదు అభిమానులకు, మా జట్టుకు ఎంతో ప్రత్యేకం. 18 ఏళ్ల మా కల సాకారమైంది. ఆర్సీబీ విజయం కోసం నేను చేయాల్సిందంతా చేశాను. ఇలాంటి రోజు వస్తుందని నేను అస్సలు ఊహించలేదు. హేజిల్‌వుడ్ చివరి బంతి వేశాక జట్టులోని ప్రతిఒక్కరం ఎంతో భావోద్వేగానికి లోనయ్యాం. ఆరంభ సీజన్ నుంచి నేను ఆర్సీబీకే ఆడుతున్నా. నా హృదయం ఎప్పుడూ బెంగళూరుతోనే ఉంటుంది. ఈరోజు రాత్రి నేను చిన్నపిల్లాడిలా హాయిగా నిద్రపోతాను' అని కోహ్లీ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

8 అర్ధ శతకాలతో..

ఐపీఎల్ తొలి సీజన్ నుంచి కోహ్లీ ఆర్సీబీని అట్టిపెట్టుకొని ఉన్నాడు. ఫెయిల్యూర్ టీమ్ అనే ముద్ర పడినా సరే అతడు మాత్రం బెంగళూరును మాత్రం వీడలేదు. 2016లో కెప్టెన్‌గా జట్టును ఫైనల్‌కు తీసుకువెళ్లిన విరాట్.. టైటిల్ కరువు మాత్రం తీర్చలేకపోయాడు. 17వ సీజన్ ముందు కెప్టెన్సీ వదులుకున్న విరాట్.. ఒత్తిడి లేకుండా ఆడడం మొదలెట్టాడు. 18వ సీజన్లో 8 అర్ధ శతకాలతో ఆర్సీబీ విజయాల్లో కీలక పాత్ర పోషించిన అతడు.. ఫైనల్లోనూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఓవైపు వికెట్లు పడుతున్న 43 పరుగులతో జట్టు భారీ స్కోర్‌లో భాగయ్యాడీ రన్ మెషీన్. 191 రన్స్ ఛేదనలో పంజాబ్‌ను 184కే కట్టడి చేసిన ఆర్సీబీ తొలిసారి విజేతగా అవతరించింది.

# ది రాజా సాబ్' ఆగమనం..

## అదిరిపోయే అప్‌డేట్ పంచుకున్న టీమ్



మూవీ న్యూస్ ,03 జూన్ (కెరటం న్యూస్): ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' . భారీ అంచనాల మధ్య రానున్న ఈ మూవీ అప్‌డేట్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నిర్మాణ సంస్థ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా టీజర్ జూన్ 16న రానున్నట్లు తెలిపింది. అలాగే డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నట్లు ప్రకటించింది . ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను పంచుకుంది.

ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన వీడియోలు, పోస్టర్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి.

అభిమానులకు పండగే : రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ దర్శకుడు మారుతీ పోస్ట్ పెట్టారు. 'మీ అందరకీ ప్రామిస్ చేసినట్లే మీరు కోరుకున్నట్లు ప్రభాస్‌ను బిగ్‌స్క్రీన్‌పై చూస్తారు. ఆరోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి' అని క్యాప్షన్ పెట్టారు. మారుతి – ప్రభాస్ కాంబోలో వస్తోన్న తొలి చిత్రమిది. తమన్ ఇప్పటికే ఈ సినిమాలో నాలుగు పాటలు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. వైవిధ్యమైన థీమ్స్‌తో వీటిని డిజైన్ చేసినట్లు వెల్లడించారు.

# నేను ఒక్క దాన్నే

## అందాలు ఆరబోయడం లేదు..

మూవీ న్యూస్ ,03 జూన్ (కెరటం న్యూస్): ఈ రోజుల్లో అందాల ముద్దుగుమ్మలు గ్లామర్ షో చేయడం మనం చూస్తూనే ఉన్నాం. సినిమా ఆఫర్స్ తగ్గిన సమయంలో నిత్యం అందాలు ఆరబోస్తూ రచ్చ చేస్తున్నారు. అయితే గ్లామర్ షో సమయంలో కొందరు దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఓ ముద్దుగుమ్మని దారుణంగా ట్రోల్ చేయడంతో ఆమె ఇచ్చిన సమాధానం అందరిని ఆశ్చర్యపరిచింది. నేను ఒక్క దానినే అందాలు ఆరబోయడం లేదు.. మిగతా హీరోయిన్స్ కూడా అదే చేస్తున్నారంటూ కామెంట్ చేసింది. ప్రస్తుతం ఈ అమ్మడి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకు ఆ హీరోయిన్ ఎవరని మీరు అనుకుంటున్నారా. ఆమె మరెవరో కాదు మలయాళం, తమిళం, తెలుగు చిత్రాల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాళవిక మీనన్.2011లో మలయాళ సినిమా ద్వారా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ మలయాళీ ముద్దుగుమ్మ ఇప్పటివరకు 60పైనే సినిమాల్లో కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించి పేరు తెచ్చుకుంది. ఇటీవల ఈ భామ నటించిన రెండు మలయాళ చిత్రాలు తంకమణి , వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ కొచ్చి విడుదలై మంచి గుర్తింపును తీసుకువచ్చాయి. వరుస సినిమా ఆఫర్స్‌తో ఫుల్ జోరులో ఉన్న ఈ ముద్దుగుమ్మ అందాల వడ్డింపులో ఏ మాత్రం కాంప్రమైజ్ కావడం లేదు. తరచు తన గ్లామర్ షోతో రచ్చ చేస్తూనే ఉంటుంది. అయితే దీనిపై కొందరు నెటిజన్స్ ట్రోల్ చేశారు. అవకాశాల కోసమే మాళవిక అలా తన బాడీ చూపించుకుంటుందని కొందరు కామెంట్స్ చేశారు.దీని గురించి తాజాగా స్పందించిన మాళవిక మీనన్.. నేను ఎప్పుడు కూడా ఛాన్స్‌ల కోసం గ్లామర్ షో చేయలేదు. అయిన అందాలు చూపించడంలో తప్పేంటి. మలయాళ చిత్రాలలో ఎక్స్‌పోజ్ చేసే ఛాన్స్ ఉండదు. తెలుగు, తమిళ భాషలలోనే అలా నటించవచ్చు. ముఖం చూపించకుండా సోషల్ మీడియాలో నా గురించి రాసే వారిని నేను పట్టించుకోను. అయిన నేను ఒక్క దానినే గ్లామర్ ఫొటోలు షేర్ చేయడం లేదు, చాలా మంది హీరోయిన్స్ అలానే చేస్తున్నారు అని పేర్కొంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

